సాక్షి
నంద్యాల
శుక్రవారం : 3 : ఫిబ్రవరి : 2023



దత్తాత్రేయుడికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి దేవస్థానం ఈఓ లవన్న అర్చకులు విశేషపూజలను నిర్వహించారు.



ఆరంభం అదిరింది

సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఎస్పీఎల్) పోటీలు గురువారం కర్నూలు వైద్యకళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పోటీలు హోరాహోరీగా సాగాయి.

8లో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,615.87
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 50.508
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,056

న్యూస్‌రీల్

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ఉత్సవ ఆహ్వాన పత్రిక విడుదల చేసిన ఎమ్మెల్యే శిల్పా



పోస్టర్లను విడుదల చేసిన ఎమ్మెల్యే శిల్పా

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమష్టి సహకారంతో విజయవంతం చేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. మహానందిలో గురువారం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రధానార్చకులు అర్జునశర్మ, పండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించి భక్తుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వర్‌రెడ్డి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగభూపాల్‌రెడ్డి, కల్యాణ ఉత్సవ దాత టి.ప్రసాద్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గజ్జా సంపూర్ణ, బండి హేమలత, తపిల లక్ష్మీదేవి, గంగిశెట్టి మల్లికార్జున, బి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

నిప్పులవాగుకు నీటి సరఫరా



కేసీ కాల్వలో నిండుగా ప్రవహిస్తున్న సాగునీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 1,200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కాల్వకు 735 క్యూసెక్కులు, సుంకేసుల డ్యాం నుంచి 1,200 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వినియోగించుకున్న అనంతరం లాకిన్స్‌లా వరకు చేరుతున్న 1,800 క్యూసెక్కుల నీటిలో 1,200 క్యూసెక్కులు నిప్పులవాగుకు, 600 క్యూసెక్కుల నీటిని తూడిచెర్ల సబ్‌చానల్‌కు సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్చి నెలాఖరు వరకు కేసీ కాల్వకు సాగునీరు సరఫరా అయ్యే అవకాశాలున్నాయని ఆలోగా రైతుల పంటలు పూర్తిగా చేతికందనున్నాయని ఆయన తెలిపారు.

మహానందీశ్వరుడికి రూ.2.66 కోట్ల ఆదాయం



సీల్డుటెండర్లు ఓపెన్ చేస్తున్న అధికారులు

మహానంది: టోల్‌గేట్ల నిర్వహణ, అభిషేక సామగ్రి విక్రయాలు, లాకర్ల నిర్వహణ టెండర్లలో మహానందీశ్వరుడికి రూ.2.66 కోట్ల ఆదాయం సమకూరింది. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో టెండర్లు నిర్వహించారు. టోల్‌గేట్ నిర్వహణను రూ.1.54 కోట్లకు నంద్యాల బేకర్స్‌పార్క్ యజమాని, అభిషేకపూజా సామగ్రి విక్రయానికి రూ.59,99,999, సెల్‌పాయింట్, లాకర్ల నిర్వహణను రూ.19,99,999కు మహానందికి చెందిన టి.దేవేంద్రకుమార్ దక్కించుకున్నారు. పాదరక్షల నిర్వహణకు రూ.13 లక్షలు, తలనీలాల సేకరణకు రూ.5.50 లక్షలు, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.12.35 లక్షలు ఆదాయం వచ్చింది. అలాగే కొన్ని భూముల వేలాల ద్వారా రూ.1,76,600 కలిపి మొత్తం రూ.2,66,61,598 ఆదాయం వచ్చింది. కార్యక్రమాల్లో ఏఈఓ ఎర్రమల మధు, గ్రూపు ఆలయాల ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ధర్మకర్తలు మల్లికార్జున, బి.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధితో ఆర్థిక భరోసా

బండిఆత్మకూరు: ఉపాధి పథకంతో కూలీలకు ఆర్థిక భరోసా లభించిందని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పిస్తున్నామన్నారు. అంతకుముందు గాం.దీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బారెడ్డి రామతొలిశమ్మ, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఈఓఆర్డీ శ్రీనివాసులు, ఏపీఓ వసుధా రెడ్డి, ఈసీ వరదరాజులు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, టీఏ ప్రసాద్ పాల్గొన్నారు.



బేతంచెర్ల మండలం సీతారామాపురం సమీపంలో అంజూరలో సాగు చేసిన బంతి పూలు



కోటకందుకూరు సమీపంలో దానిమ్మలో అంతర పంటగా సాగు చేసిన చిక్కుడు



సపోటలో సాగు చేసిన పూల మొక్కలు

అంతర సాగు.. ఆదాయం బాగు

- ఏటికేడు పెరుగుతున్న మిశ్రమ పంటల సాగు విస్తీర్ణం
- అంతర పంటలుగా పండ్లు, కూరగాయలు, తీగ జాతి మొక్కల సాగుకు అన్నదాతలు ఆసక్తి
- రాయితీలు ఇచ్చి అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో పండ్ల తోటల సాగు 38,770 ఎకరాలు
- ఈ ఏడాది సాగైన అంతర పంటలు 23,258 ఎకరాలు

అన్నదాతలు ఆధునిక పద్ధతులపై ఇప్పుడిప్పుడే దృష్టిసారిస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు.. ప్రభుత్వ ప్రోత్సాహంతో తక్కువ ఖర్చుతో రెండు, మూడు రకాల పంటలు సాగు చేస్తూ ఆదాయం పొందుతూ మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకే సీజన్‌లో.. ఒక పంట వేసిన పొలంలోనే కొద్దిరోజుల విరామంతో మరో పంట వేసి అంతర సాగు చేపడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఒక పంట నష్టాన్ని మిగిల్చినా మరో పంటైనా గట్టెక్కిస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వం కూడా మిశ్రమ పంటల సాగును ప్రోత్సహిస్తోంది.



చీనీ తోటలో అంతర పంటగా వేరుశనగ సాగు చేసిన దృశ్యం

జిల్లాలో పండ్లతోటల సాగు, అందులో అంతర పంటల సాగు విస్తీర్ణం ఎకరాల్లో

పండ్ల తోటల రకం	విస్తీర్ణం ఎకరాల్లో	అంతర పంటలు సాగు ఎకరాల్లో
అరటి	9,576.00	2,500
నిమ్మ	3,807.05	2,457
మామిడి	11,640.75	7,856
బత్తాయి	1,254.00	984
బొప్పాయి	1,054.50	652
జామ	657.00	120
ఇతర తోటలు	10,780.00	8,689

ఆళ్లగడ్డ: జిల్లాలో అంతర పంటల సాగుకు నేలలు అనుకూలంగా ఉండటంతో ఆ దిశగా రైతులు మొగ్గు చూపుతున్నారు. ఒక పంటతో నష్టపోతే రెండో పంట ద్వారానైనా ఆదాయం పొందేందుకు అంతర పంటల సాగు చేపడుతున్నారు. నల్లమల అటవీ సమీపంలోని గ్రామాల్లో ఉన్న మెట్ట పొలాల్లో పండ్ల తోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అందుకు అనుగుణంగా రాయితీలు కల్పిస్తూ సాగు చేసేలా చర్యలు చేపడుతోంది. సంప్రదాయ పంటలకు బదులు పండ్ల తోటలు సాగు చేయడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని పండ్ల తోటల్లో సీజనల్‌గా అంతర పంటలు సాగు చేస్తే నిరంతరం ఆదాయం పొందవచ్చని రైతులకు అవగాహన కల్పిస్తుంది. అంతర, మిశ్రమ పంటల సాగు చేపడుతూ నష్ట భయాన్ని తగ్గించుకుని అదనపు ఆదాయం పొందుతూ భూసారాన్ని పెంచుకుంటూ కొత్త ఆలోచనలకు పదును పెడుతూ ముందుకు 'సాగు'తున్నారు. జిల్లాలో మొత్తం పండ్ల తోటల సాగు 38,770 ఎకరాలు ఉండగా అందులో ఈ ఏడాది 23,258 ఎకరాల్లో అంతర పంటలు సాగవుతున్నట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖల లెక్కలు చెబుతున్నాయి

బహుళ ప్రయోజనాలు..

ఆధునిక వ్యవసాయంలో అంతర, మిశ్రమ పంటల సాగు అత్యంత కీలకమైనది. కేవలం ఒకే పంట సాగుకు పరిమితమైతే నష్టాలు సంభవించే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఒకే సారి రెండు, మూడు రకాల పంటలు వేస్తే ప్రతికూల పరిస్థితుల్లో ఒక పంట అయినా చేతికి వస్తుంది. భూమిలో పోషకాల వినియోగం తగ్గుతుంది. కలుపు బెడద తప్పుతుంది. నేలకోతకు ఆస్కారం ఉండదు. భూసారాన్ని కాపాడుకోవచ్చు. నత్రజని శాతం పెరుగుతుంది. పప్పుధాన్యాల సాగుతో భూసారాన్ని మరింత పెంచుకోవచ్చు. ప్రధాన పంటలను ఆశించే చీడపీడలను అరికట్టవచ్చు. సహజ వనరులను ఎక్కువ మొత్తంలో వినియోగించుకోవచ్చు. ఎరువుల వినియోగం తగ్గుతుంది. ప్రధాన పంటపై ఆశించే చీడపీడలను అరికట్టవచ్చు.

పెరుగుతున్న తోటల సాగు

కొన్నేళ్లుగా వాతావరణ పరిస్థితుల్లో నెలకొంటున్న మార్పుల వల్ల సరైన సమయంలో వర్షాలు లేక.. అవసరములేనప్పుడు కురుస్తున్న కుండపోత వర్షాలతో కర్షకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన పెట్టుబడులు, కూలీల కొరత కారణాల వల్ల దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. జిల్లాలోని సుమారు 18 మండలాల్లో మామిడి, జామ, సపోట, నిమ్మ, బొప్పాయి, అరటి వంటి పండ్ల తోటలను విరివిగా సాగు చేస్తున్నారు. ఈ తోటల్లోనే అంతర పంటలుగా వివిధ రకాల కూరగాయలు, అపరాలతో పాటు అనేక వాణిజ్య పంటలు సైతం సాగు చేస్తూ మంచి ఫలితాలు రాబడుతుండటం, మూడేళ్ల నుంచి జిల్లాలో పండ్ల తోటలు సాగుచేస్తున్న రైతులందరూ దాదాపు అంతర, మిశ్రమ పంటల సాగువైపు మొగ్గు చూపుతుండటంతో ఏటికేడు సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

మంచి ఆదాయం



నాకున్న రెండు ఎకరాల్లో ఎటువంటి పెట్టుబడి లేకుండా ప్రభుత్వ రాయితీతో నిమ్మ మొక్కలు నాటుకున్నా. అందులో ఏటా అంతర్ పంటలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నా. అంతర్ పంటలు సాగు, సేద్యాలు, కూలీల ఖర్చులు కూడా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఇస్తుండటంతో మంచి ఆదాయం పొందుతున్నా.

– లక్ష్మీదేవి, రైతు, మర్రిపల్లె

పెట్టుబడితో పని లేదు



మూడు ఎకరాల్లో చీనీ, నిమ్మ మొక్కలు నాటుకున్నా. అధికారుల సూచనతో అంతర్ పంటలుగా మినుము, శనగ, వేరుశనగ, ఇతర కూరగాయల పంటలు సాగు చేస్తున్నా. పండ్ల చెట్లకు పెట్టే పెట్టుబడితోనే అంతర పంటల దిగుబడులు చేతికందుతున్నాయి.

– సుబ్బరాయుడు, రైతు, మర్రిపల్లె

నష్టభయం ఉండదు



పండ్ల మొక్కలు దూరంగా ఉండటంతో వాటి మధ్య ఖాళీగా ఉన్న భూమి మొత్తం వినియోగంలోకి వస్తుంది. అంతర పంటల ద్వారా అధికంగా లాభాలు పొందవచ్చు. భూమిలో సత్తువ పెరిగి పంట దిగుబడి పెరిగే అవకాశముంది. పండ్ల తోటల్లో అంతర పంటలుగా చిరుధాన్యాలు, కూరగాయలు, పూలు, పండ్ల తోటల సాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– నాగరాజు, జిల్లా ఉద్యానశాఖాధికారి

ఆళ్లగడ్డకు చేరుకున్న అహోబిలేశుడు

- ఉత్సవ పల్లకీకి సంప్రదాయ బద్ధంగా స్వాగతం



పల్లకీలో కొలువైన ఉత్సవమూర్తులు శ్రీ జ్వాలనారసింహుడు, ప్రహ్లాదవరదుడు



స్వామి ఉత్సవ పల్లకీని పట్టణంలోకి తీసుకువస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ: శ్రీ అహోబిలేశుడి పార్వేట మహోత్సవాల్లో భాగంగా గ్రామగ్రామాన విశేష పూజలందుకుంటూ భక్తులకు దర్శనభాగ్యం కలిగిస్తూ ఊరేగుతున్న ఉత్సవ పల్లకీ గురువారం ఆళ్లగడ్డ పట్టణానికి చేరుకుంది. ఉత్సవమూర్తులు శ్రీ జ్వాలనరసింహస్వామి, శ్రీ ప్రహ్లాదవరదస్వాముల పల్లకీ పడకండ్లలో పూజలు అందుకున్న అనంతరం ఆళ్లగడ్డ పట్టణానికి చేరుకుంది. పల్లకీ పట్టణ పొలిమేర వక్కిలేరు బ్రిడ్జి సమీపంలో పట్టణవాసులు గోవిందా.. గోవింద అంటూ ఘన స్వాగతం పలికారు. పట్టణానికి చేరుకున్న ఉత్సవ మూర్తులను సంప్రదాయం ప్రకారం మొదట పురపాల సంఘం (పంచాయతీ) తహసీల్దార్, తర్వాత సబ్ రిజిస్ట్రార్, ఉప ఖజానా, పోలీసు కార్యాలయ అధికారులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. దీంతో అహోబిలేశుడి తిరునాల ప్రారంభమైంది. ప్రధాన వీధుల్లో వెలసిన అంగళ్ల వద్ద రద్దీ నెలకొంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా మున్సిపల్, పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. పాతబస్టాండు నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకు రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు. ముత్యాలపాడు – చాగలమర్రి, అహోబిలం, రుద్రవరం తదితర గ్రామాల వైపు వెళ్లనున్న ఆర్టీసీ బస్సులు, ఆటోలు బైపాస్ రోడ్డులో తిరిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దాదాపు వారం రోజులపాటు తిరునాల సందడి కొనసాగుతుంది. చిన్నారులు, యువతీ యువకులు రంగుల రాట్నాల్లో కేరింతలు కొడుతుండగా.. మహిళలు తమ ఇళ్లకు వచ్చిన ఆడపడుచులకు, బంధువుల కోసం గాజులు, కుంకుమ కొనుగోలు చేస్తూ కనిపించారు. జిల్లా నలుమూలల నుంచే గాక పొరుగున ఉన్న వైఎస్సార్ జిల్లా నుంచి అనేక మంది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమగ్ర రీసర్వే పనులు వేగవంతం చేయండి

- రబీ పంట ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, అధికారులు

నంద్యాల: జగనన్న భూహక్కు భూ రక్ష పథకం కింద చేపట్టిన సమగ్ర రీసర్వే పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి కలెక్టర్లను, జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగాలు, హౌసింగ్, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, డీఆర్‌ఓ పుల్లయ్య, హౌసింగ్ పీడీ రామశేషు, గ్రామీణ నీటిసరఫరా ఎస్‌ఈ మనోహర్, డీఈఓ అనురాధ తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూతింగ్, డ్రోన్ సర్వే, మ్యుటేషన్స్ తదితర అంశాల్లో లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. మొదటి విడతలో వచ్చిన కరెక్షన్స్, రిజిస్ట్రేషన్‌లు ఈ నెల 16లోపు పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులకు భూసేకరణ, ఈక్రాప్ బుకింగ్, వైఎస్సార్ యంత్ర సేవా పథకం గ్రౌండింగ్ తదితర పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించి, వాటి సాగుకు ప్రోత్సహించాలన్నారు. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, నాణ్యమైన పాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌ల నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలన్నారు.

నెరవేరనున్న దశాబ్దాల కల

- డోన్ మండలానికి రెండు టీటీడీ కల్యాణ మండపాలు మంజూరు
- గుండాల, డోన్‌లో నిర్మించనున్న మండపాలకు రేపు ఆర్థిక మంత్రి బుగ్గన భూమి పూజ
- హాజరుకానున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి



కల్యాణ మండపం నిర్మాణ నమునాను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన(ఫైల్)


డోన్: తమ బిడ్డల పెళ్లిళ్లను కల్యాణ మండపాల్లో చేయాలనుకునే నియోజకవర్గ పేద తల్లిదండ్రుల కల త్వరలో నెరవేరబోతోంది. నామమాత్రపు రుసుంతో ఆలయాల సన్నిధిలో ఉన్న కల్యాణ మండపాల్లో వివాహాలు చేసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రంగాపురం సమీపంలోని మద్దిలేటిస్వామి, ప్యాపిలి మండలం బూర్గుల సమీపంలోని కంభగిరి స్వామి ఆలయాల పునరుద్ధరణ పనులు, కల్యాణ మండపాల నిర్మాణాలు చేపట్టింది. ప్రస్తుతం డోన్ సమీపంలోని ఉడుములపాడు, ఎస్.గుండాల చెన్నకేశవస్వామి ఆలయాల వద్ద మరో రెండు కల్యాణ మండపాల నిర్మాణాలకు టీటీడీ నుంచి రూ.3 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ నెల 4న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించనున్న కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డిలు హాజరుకానున్నారు.

అందుబాటులో కల్యాణ మండపాలు

పట్టణంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తే సామాన్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఒకే నియోజకవర్గంలో రెండు టీటీడీ కల్యాణ మండపాలు నిర్మించడం వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరుగుతోంది.

– సప్తశైల రాజేష్, మున్సిపల్ చైర్మన్ డోన్

కల నెరవేరుతోంది



లక్షలాది మందికి ఇంటి ఇలవేల్పు శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో పెళ్లిళ్లు చేసుకోవడానికి ఇప్పటి వరకు ఎలాంటి సౌకర్యం లేదు. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేర్చేందుకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తుండటం హర్షణీయం.

– రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ డోన్

ఆలయాలకు పూర్వ వైభవం



భవిష్యత్‌లో డోన్ ఆలయాలకు పూర్వ వైభవం రానుంది. ప్రసిద్ధ క్షేత్రాలను పునరుద్ధరించడమే గాక ఆలయాల్లో నిత్య కల్యాణ శోభ కలిగించేందుకు ప్రభుత్వం సమృద్ధిగా నిధులు విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నాం. ఈ క్షేత్రాలకు వెళ్లేందుకు ఇప్పటికే చక్కటి రహదారులను ప్రభుత్వం నిర్మించింది.

– సుదర్శన్ రెడ్డి, సర్పంచ్, కొత్తకోట గ్రామం, డోన్ మండలం

రాత్రిపూట శ్రీశైలం వచ్చే వాహనాలకు అనుమతి

శ్రీశైలం: శ్రీశైలక్షేత్రంలో ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు దోర్నాల–శ్రీశైలం ఘాట్‌లో వాహనాల రాకపోకలకు అనుమతినిస్తూ ప్రిన్సిపల్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ వై.మధుసూదన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పులుల అభయారణ్యం కావడంతో శ్రీశైలం నుంచి రాత్రి 9 గంటలకు.. శిఖరం వద్ద 9 గంటల వరకే అనుమతిస్తారు. అలాగే ప్రకాశం జిల్లా, దోర్నాల చెక్‌పోస్ట్ వద్ద కూడా వాహనాలను నిలిపేస్తారు. బ్రహ్మోత్సవాలను, భక్తులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిబంధనలతో కూడిన ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం నుంచి వెళ్లే వాహనాలు, దోర్నాల నుంచి వచ్చే వాహనాలు కేవలం 40కిమీ. వేగంతోనే ప్రయాణించాలని.. 10 నుంచి 15వాహనాలకు ముందు అటవీశాఖ ఎస్కార్ట్ వాహనం ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ, కేఎస్‌ఆర్టీసీ, టూరిస్ట్ బస్సులు, ఫోర్‌వీలర్స్ వాహనాల్లో ప్లాస్టిక్ వస్తువులు, మద్యం తీసుకురాకుండా చెకింగ్ ఉంటుందన్నారు. ఘాట్‌రోడ్డులో ఎట్టి పరిస్థితుల్లో హార్న్ వినియోగించకూడదని.. ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపివేసి, చెట్ల కింద పడుకోవడం లాంటివి చేయకూడదన్నారు. అటవీశాఖ సిబ్బంది వాహనాల కదలికపై పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు.

10 వరకు 'సుకన్య సమృద్ధి' మేళా

కర్నూలు(రాజ్‌విహార్): సుకన్య సమృద్ధి ఖాతా మేళాను ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఎం. జగదీష్‌పాయ్ గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు రీజియన్‌లో 17 వేల ఖాతాలు తెరిపించాల న్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. సుకన్య సమృద్ధి పథకంతో పదేళ్లలోపు బాలికలకు అనేక ప్రయోజనాలు ఉన్నా యని తెలి పారు.కర్నూలుతో పాటు ఉమ్మడి అనం తపురం, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో ఈ మేళా ఉంటుందని పేర్కొన్నారు.

ఆరంభం అదిరింది

- సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించిన కర్నూలు టౌన్ డీఎస్పీ మహేష్
- మొదటి రోజు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లు


సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీ దృశ్యం


సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్, చిత్రంలో పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు


కర్నూలు(టౌన్): సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఎస్పీఎల్) పోటీలు వరుసగా నాలుగో ఏడాది ప్రారంభమయ్యాయి. కర్నూలు వైద్యకళాశాల మైదానంలో గురువారం పోటీలను కర్నూలు టౌన్ డీఎస్పీ మహేష్, జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ సతీష్‌రావు, బ్యూరో ఇన్‌చార్జ్ రవివర్మ హాజరయ్యారు. సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలకు డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల వ్యవహరిస్తోంది. జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి జూనియర్, సీనియర్ స్థాయిల్లో 18 జట్లు పాల్గొన్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో తొలి రోజే బ్యాటర్లు ఫోర్లు, సిక్స్‌లతో అదరగొట్టారు. బౌలర్లు తమ పదునైన బౌలింగ్‌తో అబ్బురపరిచారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు టౌన్ డీఎస్పీ మహేష్, సీఐ తబ్రేజ్ బ్యాటింగ్, బౌలింగ్ చేసి అలరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ 'సాక్షి' యాజమాన్యం క్రీడలను ప్రోత్సహించడం అభినందించదగ్గ విషయమన్నారు. క్రీడలతో మానసిక ఆరోగ్యంతోపాటు శారీరకంగా దృఢత్వం లభిస్తుందన్నారు. స్నేహసంబంధాలు మెరుగుపడతాయన్నారు. తరచుగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రత్యేక గుర్తింపుతో పాటు ఉద్యోగావకాశాలు కూడా వస్తున్నాయన్నారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.


ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు


బౌలింగ్ ప్రతిభ : బౌల్డ్ అయిన దృశ్యం


బ్యాటింగ్ నైపుణ్యం: ఫోర్ కొడుతూ..


పరుగులే పరుగులు

బోణీ కొట్టిన 'పుల్లయ్య కాలేజీ' జట్టు


విజేతగా నిలిచిన పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు

మొదటి రోజు వివిధ జట్ల మధ్య పోటీలు ఆసక్తికరంగా సాగాయి. తొలిమ్యాచ్ జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, బేతంచెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాల జట్ల మధ్య జరిగింది. బేతంచెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాల జట్టు 9 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. అనంతరం 66 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు కేవలం 2 వికెట్లు కోల్పోయి 7 ఓవర్లలో విజయ లక్ష్యం చేరుకుంది. జట్టులో చరణ్ 23, రాజేష్ 15, సోహెయిల్ 14 పరుగులు చేశారు. అబ్దుల్లా 3, రాజేష్ 2 వికెట్లు తీశారు.

'సాయిక్రిష్ణ' జయకేతనం


రెండో మ్యాచ్‌లో గెలిచిన సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాల జట్టు

రెండో మ్యాచ్ పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కర్నూలు సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాల జట్ల మధ్య సాగింది. టాస్ గెలిచిన సాయిక్రిష్ణ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌లో పత్తికొండ డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లు ఆడి 9 వికెట్ల నష్టానికి 66 పరుగులు చేసింది. 67 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాల జట్టు 7.3 ఓవర్లలోనే గెలుపొందింది. బ్యాటింగ్‌లో విష్ణు 5 ఫోర్లు 1 సిక్స్‌తో 34 పరుగులు చేశాడు.

'శాంతిరామ్' ఆల్‌రౌండ్ ప్రతిభ


మూడో మ్యాచ్ విజేత నంద్యాల శాంతిరామ్ కళాశాల జట్టు

మూడో మ్యాచ్ నంద్యాలకు చెందిన శాంతిరామ్ ఫార్మసీ కళాశాల, ఎమ్మిగనూరుకు చెందిన సెయింట్ జాన్స్ ఫార్మసీ కళాశాల జట్ల మధ్య జరిగింది. బ్యాటింగ్‌లో శాంతిరామ్ ఫార్మసీ కళాశాల దూకుడుగా ఆడి 10 ఓవర్లలో 92 పరుగులు చేసింది. జట్టులో తౌషిక్ అత్యధికంగా 29 పరుగులు చేశాడు. శాంతిరామ్ కళాశాల జట్టు ఆల్‌రౌండ్ ప్రతిభతో సెయింట్ జాన్స్ ఫార్మసీ కళాశాల జట్టు 8.5 ఓవర్లలోనే ఆల్‌ఔట్ అయ్యి ఓటమి పాలైంది.

ఎమ్మిగనూరులో 4న జాబ్ మేళా

కర్నూలు కల్చరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ ట్రెనింగ్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, జిల్లా ఉపాధి కల్పనా అధికారి సోమ శివరెడ్డి తెలిపారు. గ్రీన్‌టెక్, హెటీరో ల్యాబ్స్, సుకృతి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, హీల్‌మై ఫ్యామిలీ, వన్‌పాయింట్ వన్ సొల్యూషన్, ఖజానా జ్యువెలరీ, నవభారత్ ఫర్టిలైజర్స్, జియోమార్ట్, శ్రీరామ్ చిట్స్ కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల వయసులోపు వారు అర్హులని పేర్కొన్నారు. రూ.10,000 నుంచి 25,000 జీతం ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారు https:// bit. ly/3 wadp8 v లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 99854 96587, 88859 04099 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'జగనన్న విదేశీ విద్య'కు హిమవర్ష ఎంపిక



కర్నూలు(అర్బన్): జగనన్న విదేశీ విద్య పథకానికి దేవనకొండ మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన పీ హిమవర్ష ఎంపికైనట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిమవర్ష కజకిస్తాన్‌లోని అల్ ఫరాబీ నేషనల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువుతున్నదన్నారు. ఈ యూనివర్సిటీ టాప్ -2లో ఉన్న కారణంగా అక్కడ ఉన్న ఫీజులో 50 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నదన్నారు. కజకిస్తాన్‌లో రూ.24 లక్షలు ఫీజు ఉండగా, రూ.12 లక్షలను ప్రభు త్వం విడుదల చేయనుందన్నారు. శుక్రవారం విదేశీ విద్యా దీవెన విడుదలవుతున్న నేపథ్యంలో హిమవర్షకు మొదటి విడతగా రూ.3 లక్షలు జమ కానుందని ఆయన తెలిపారు.

కేసీలో వ్యక్తి మృతదేహం లభ్యం

గోస్పాడు: మండల పరిధిలోని యాళ్లూరు సమీపంలో ఉన్న కేసీ కాల్వలో గురువారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శిరివెళ్ల మండలం కామినేని పల్లె గ్రామానికి చెందిన బుగ్గ విజయచంద్ర (42), విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. భార్య విజయలక్ష్మి అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితమే మృతిచెందడంతో విజయచంద్ర కూలీ పనులు చేస్తూ ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నాడు. బుధవారం దుస్తులు ఉతుక్కోవడానికి సమీపంలోని కేసీ కెనాల్‌కు వెళ్లాడు. అక్కడ కాలుజారి నీటిలో పడి గల్లంతయ్యాడు. ఉదయం యాళ్లూరు సమీపంలోని కేసీ కాల్వలో మృతదేహం లభ్యమైంది. కాగా తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో కుమారులు అనాథలయ్యారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సంజీవ రాయుడు తెలిపారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బరాయుడు

బనగానపల్లె రూరల్: ఏటీఎం సెంటర్ల వద్ద సాయం చేసే నెపంతో అమాయకుల నుంచి డబ్బు తస్కరించే ఇద్దరి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ రామిరెడ్డిలు గురువారం విలేకరులకు వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన సీసాల ఈశ్వరయ్య, బత్రింకల మునిస్వామి అలియస్ మనోహర్‌లు స్థానిక స్టేట్‌బ్యాంకు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా ఏటీఎంల సెంటర్ల వద్ద అమాయకులను, చదువురాని వారికి డబ్బు డ్రా చేసి ఇస్తామని నమ్మించి, డమ్మీ ఏటీఎం కార్డులను ఇచ్చి, ఆ తర్వాత సొమ్మును కాజేస్తున్నట్లు అంగీకరించారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.65 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

కేసీ కెనాల్ ఘటనపై స్పందించిన హెచ్ఆర్‌సీ

- భద్రత ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశం

కర్నూలు (టౌన్): కేసీ కెనాల్ వద్ద భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని హెచ్ఆర్‌సీ ఆదేశించింది. వివరాలు.. 2021 సంవత్సరం నవంబర్ 19వ తేదీన కర్నూలు నగరంలో కార్తీక దీపారాధన ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు నగర పాలక సంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే అదే రోజు సాయంత్రం నగరానికి చెందిన రాఘవేంద్ర, భార్య ఇందిరా కేసీ కెనాల్‌లో దీపాలు వదిలేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు అందులో మునిగి మృతి చెందారు. దీంతో స్థానిక గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని వెంకటాద్రినగర్‌కు చెందిన శివుడు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఏర్పాట్లు, పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇటువంటి సంఘటన జరిగిందని హెచ్ఆర్‌సీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించి హెచ్ఆర్‌సీ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. కార్తీక మాసం రోజున కాకుండా రెండు రోజులు అదనంగా అక్కడ ఏర్పాట్లు, భద్రతను కొనసాగించాలని ఆదేశించింది.

పైనుంచి పడి సెంట్రింగ్ కూలీ మృతి

కర్నూలు: నగర శివారులోని వెంకటాద్రి నగర్‌లో భవన నిర్మాణ పను ల్లో సెంట్రింగ్ కూలీ బోయ మద్దిలేటి (45) ఐదవ అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందాడు. కాంట్రాక్టర్ జయపాల్ దగ్గర మద్దిలేటి కొంతకాలంగా కూలీగా పనిచేస్తున్నాడు. గురువా రం ఉదయం 5వ అంతస్తులో పని చేస్తుండగా లిఫ్ట్ డోర్‌లో నుంచి గుంతలోకి జారిపడటంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య ఎల్లమ్మతో పాటు ముగ్గురు కూతుర్లు సంతానం. భార్య ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

దంపతుల ఆత్మ హత్యాయత్నం

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరు గ్రామానికి చెందిన హరిప్రసాద్, శారద దంపతులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులు స్పందించి వారించడంతో ప్రమాదం తప్పింది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. దంపతులు ఎల్లావత్తులో ఉన్నప్పుడు అదే గ్రామానికి చెందిన ధర్మతేజా అనే వ్యక్తికి రూ.3.5 లక్షలు అప్పుగా ఇచ్చారు. ఇచ్చిన సొమ్ము తిరిగి చెల్లించాలని కొంతకాలంగా కోరుతున్నా స్పందించక పోవడంతో వారు పోలీసులను ఆశ్రయించేందుకు స్టేషన్‌కు చేరుకున్నారు. ఈక్రమంలో ఆత్మహత్యకు ప్రయత్నించగా వారించి ఇంటికి పంపించామని ఎస్ఐ తెలిపారు.

బాలోత్సవం నిర్వహణ కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్: బాలోత్సవం-2023 నిర్వహణ కమిటీని గురువారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఎన్నుకున్నట్లు కమిటీ గౌరవ సలహాదారులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శిగా జేఎస్ శేషయ్య, కన్వీనర్లుగా కెంగార మోహన్, ఎంపి బసవరాజు, సభ్యులుగా సురేష్‌కుమార్, జయరాజు, నరసింహ, వినయ్‌కుమార్, రంగస్వామి,చక్రపాణి యాదవ్, విజయులు, ఉమ ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి శేషయ్య మాట్లాడుతూ త్వరలోనే బాలోత్సవం తేదీలను ప్రకటిస్తామన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు బాలోత్సవం వేదిక ఉపయోగ పడుతుందన్నారు.

వినికిడి లోపంతో రైలు కింద పడి యువకుడి మృతి


రాజు (ఫైల్)

ఆదోని టౌన్: పట్టణంలోని సోమప్పనగర్‌లో నివాసముంటున్న మెకానిక్ ఎం.రాజు(24) తనకున్న వినికిడిలోపం కారణంగా గురువారం రైలు కింద పడి మృతిచెందాడు. రైల్వే ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు.. సోమప్పనగర్‌లో నివాసముంటున్న ఎం.రాజు ఉదయం బహిర్భూమికి వెళ్లాడు. రైలు పట్టాలు దాటుతుండగా ఆ యువకుడికి ఉన్న వినికిడి లోపం కారణంగా అటుగా వస్తున్న రైలు శబ్దం వినిపించలేదు. దీంతో యువకుడిని రైలు కింద పడి మృతి చెందాడు. యువకుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించామని రైల్వే ఎస్ఐ తెలిపారు. యువకుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ విజేత కర్నూలు

- బాలికల విభాగంలో కడప జయకేతనం


విజేతగా నిలిచిన కర్నూలు జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న డీఈఓ రంగారెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో బాలుర విభాగంలో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో కడప జట్టు జయకేతనం ఎగురవేసింది. కర్నూలు శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడామైదానంలో ఈ పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో అండర్-14 బాల బాలికల విభాగంలో మూడు రోజుల పాటు సాగిన పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్స్‌లో బాలుర విభాగంలో కర్నూలు జట్టు ప్రకాశం జట్టుపై (10-05 గోల్స్) విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ప్రకాశం జట్టుకు రన్నర్స్ ట్రోఫీ దక్కింది. బాలికల విభాగంలో కడప జట్టు ప్రకాశం జట్టుపై (5-0) విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. రన్నర్స్‌గా ప్రకాశం జట్టు నిలిచింది. విజేతలకు కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి. రంగారెడ్డి, ఆదర్శ విద్యా సంస్థల అధినేత బి.తిమ్మయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల సలహాదారుడు విజయ్‌కుమార్ ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రగ్బీ పోటీల అబ్జర్వర్ రవిప్రసాద్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కేజీ కిషోర్, లద్దగిరి శేఖర్ పాల్గొన్నారు.

సెబ్ అధికారుల మెరుపు దాడులు

- భారీగా కర్ణాటక మద్యం పట్టివేత
- స్కార్పియో వాహనం, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం


పట్టుబడిన మద్యం, నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్:స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు గురువారం తెల్లవారుజామున మెరుపుదాడులు నిర్వహించారు.కోడుమూరు నుంచి కృష్ణాపురం వెళ్లే రోడ్డులో మడుగుండ్ల వాగు వద్ద స్కార్పియో వాహనంతోపాటు బైక్‌పై కృష్ణగిరి మండలంలోని చిట్యాల గ్రామానికి తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న కర్నూలుకు చెందిన ఈడిగ గిరిబాబు, కృష్ణగిరి మండలం కోయిలకొండకు చెందిన ఆంజనేయులు, డోన్‌కు చెందిన ఉపేంద్రపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ శ్యాంప్రసాద్ తెలిపారు. దాడుల్లో 40బాక్స్‌ల్లో తరలిస్తున్న రూ.లక్షా 40వేలు విలువ చేసే కర్ణాటకకు చెందిన 3840 టెట్రా ప్యాకెట్లు, మద్యం రవాణాకు వినియోగిస్తున్న స్కార్పియో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న చిట్యాలకు చెందిన డ్రైవర్ చిన్న రంగడు కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

కోయిలకొండకు వెళ్లే దారిలో..

కృష్ణగిరి మండలంలోని కోయిలకొండకు వెళ్లే దారిలో తనిఖీలు నిర్వహించి మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న రెండు బాక్సుల్లో కర్ణాటకకు చెందిన 192టెట్రా ప్యాకెట్ల స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్యాంప్రసాద్ తెలిపారు. మద్యం తరలిస్తున్న డోన్ మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి రాముడు, బోయ పెద్ద మధులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో కర్నూలు సెబ్ సీఐ స్వామినాథన్, కోడుమూరు సెబ్ ఎస్ఐ సునీల్‌కుమార్, సిబ్బంది హనుమంతు, వెంకటరాముడు, నరసింహ, శంకర్ నాయక్, కరుణాకర్, కృష్ణుడు, రాజు ,సువర్ణమ్మ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.